# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 40 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 28, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## మాకూ టైం వస్తది వడ్డీతో సహా చెల్లిస్తాం!: కవిత

### నేను కేసీఆర్ బిడ్డను..

### తప్పు చేసే ప్రసక్తే లేదు: ఎమ్మెల్సీ కవిత




న్యూఢిల్లీ, ఆగస్టు 27 (నమస్తే ఉదయం): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో ఆమె తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం భావోద్వేగానికి గురైన కవిత.. 'మాకూ టైం వస్తది. మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తాం' అని హెచ్చరించారు. కవిత బెయిల్ వచ్చిన నేపథ్యంలో కవిత భర్త అనిల్, కుమారుడు మిగతా.. 2లో



పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యుత్ ఓసీ, బిసి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ

# ఛలో విద్యుత్ సౌధ మహాధర్నాకు

# వేలాదిగా తరలి రావాలి

### తెలంగాణ విద్యుత్ ఓసీ,బీసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి

## సెప్టెంబర్ 4న ఓసి, బిసి విద్యుత్ ఉద్యోగుల మహా ధర్నా

హైదరాబాద్, ఆగస్ట్ 27(నమస్తే ఉదయం): విద్యుత్ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి సెప్టెంబర్ 4వ తేదీన చేపట్ట నున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఓసీ,బీసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి కోరింది. మంగళవారం నగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సెప్టెంబర్ 4న తన పెట్ట నున్న మహా ధర్నా పోస్టర్ ను జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు విడుదల చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కొడపాక కుమారస్వామి, కో చైర్మన్ ఆర్ సుధాకర్ రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, కో కన్వీన సి భాను ప్రకాష్ లు మాట్లాడుతూ...

విద్యుత్ సంస్థల్లో కండిషన్లతో కల్పిస్తున్న పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జి , జూడీషియల్ కమిషన్ చే విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కోరింది.విద్యుత్ సంస్థల్లో కల్పించిన పదోన్నతులను తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2019 అక్టోబర్ 24 తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వు W.P.No.4415/2016 Dt.10-12-2018 నష్టపోయిన బీ.సీ , ఓ.సీ. ఉద్యోగులకు పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేసింది. W.P.No.47125/2018 Dt.4-2-2019 కోర్టు తీర్పు మేరకు విద్యుత్ సంస్థల్లో అన్ని కేడర్లలో నేరుగా నియమించబడుతున్న ఉద్యోగుల సీనియారిటీలను మెరిట్ ఆధారంగా సర్వీస్ రెగ్యులేషన్ 26(a) పార్ట్-II, తెలంగాణ స్టేట్ సబ్-ఆర్డినేట్ రూల్స్ 33(b) & 36(i), హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రకటించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో అన్ని కేడర్ల తుది సీనియారిటిలను జూనియర్ లైన్మెన్ స్థాయి నుండి చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి వరకు వెంటనే ప్రకటించాలి.

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు గతంలో యాజమాన్యాలు ఒప్పుకున్న ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



# ఎవరినీ వదిలిపెట్టం..

### - హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, ఆగస్ట్ 27(నమస్తే ఉదయం): చెరువు ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎవరినీ వదిలిపెట్టమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హైడ్రాలో మెంబర్స్‌గా మంత్రులు ఉన్నారు. అయినా సరే వారివి అక్రమనిర్మాణాలు అని తేలితే కూల్చేస్తామని హెచ్చరించారు. ఒవైసీకి చెందిన ఫాతిమా కాలేజీ, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి కాలేజీలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి.. ఇప్పటికే విచారణ ప్రారంభించామన్నారు.

చెరువుల్లో నిర్మాణాలు చేసుకునేందుకు పర్మిషన్ ఇచ్చిన అధికారులను గుర్తించాం.. వారిని త్వరలోనే జైలుకు పంపుతామన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ను ప్రారంభించబోతున్నామన్నారు. హైడ్రా ఎవరికీ నోటీసులు ఇవ్వరు.. అక్రమంగా కట్టుకున్నారు అని విచారణలో తేలితే వెంటనే కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.




### సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హెచ్ఐసీసీలో

# "గ్లోబల్ ఏఐ సమ్మిట్"

- ప్రపంచ ఏఐ రాజధానిగా హైదరాబాద్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్,ఆగస్ట్ 27(నమస్తే ఉదయం): హైదరాబాద్ నగరంలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే గ్లోబల్ ఏఐ సదస్సు నేపథ్యంలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఒక కర్టెన్ రైజర్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. పరిశ్రమ భాగస్వామిగా, హైసియా తెలంగాణ ప్రభుత్వంతోను, ఇతర పరిశ్రమలతోను సన్నిహితంగా వ్యవహరిస్తూ, సదస్సు విజయవంతం కావడానికి తనవంతు ప్రయత్నం చేస్తోంది.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, ఐటీఈ అండ్ ఈ శాఖ సీఆరో అమర్‌నాథ్ రెడ్డి, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఐటీఈ అండ్ ఈ శాఖ ఓఎస్‌డీ ఎల్.రమాదేవి, టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, మాత్ సీఈఓ రాహుల్ పైత్ తదితరులు కూడా పాల్గొని, మిగతా.. 2లో



విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ నూతన ఎస్ ఈ చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డి.ఈ. దామోదర్‌రావు

## సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ నూతన ఎస్ఈ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు, ఉద్యోగులు

మెహదీపట్నం, ఆగస్టు27(నమస్తే ఉదయం): సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ నూతన ఎస్ ఈగా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను సర్కిల్ కార్యాలయం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో నూతన ఎస్ ఈ గా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ కు సర్కిల్ డి ఈ (టెక్నికల్) దామోదర్ రావు ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నూతన ఎస్.ఈ. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా పని చేస్తూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు.

### సెప్టెంబర్ 17 నుంచి

# ప్రజా పాలన



- పది రోజుల పాటు కార్యక్రమం
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్ 27(నమస్తే ఉదయం): సెప్టెంబర్ 17 నుంచి పది రోజుల పాటు రాష్ట్రమంతటా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈసారి ప్రజాపాలన కార్యక్రమం చేపడుతామని చెప్పారు.

ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజ నర్సింహాతో కలిసి మిగతా.. 2లో

## విద్యుత్ ఆర్టిజన్లకు పదోన్నతులు కల్పించకపోతే ఉద్యమిస్తాం

### ఏపీఎస్ఈబి నిబంధనలతో ఆర్టిజన్లకు సర్వీసులు క్రమబద్ధీకరించాలి

రాజేంద్రనగర్, ఆగస్ట్ 27(నమస్తే ఉదయం): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ లకు ఇతర అధికారులు, ఉద్యోగుల మాదిరిగా తమకు పదోన్నతులు కల్పించాలని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ యాజమాన్యాన్ని కోరింది. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని కాటేదాన్ విద్యుత్ సెక్షన్లో డివిజన్లో పనిచేస్తున్న విద్యుత్తు ఆర్టిజన్ ఉద్యోగులు సమావేశమై తమ సమస్యల కోసం సమిష్టిగా కలిసి పని చేద్దామని నిర్ణయించారు.

ఈ సందర్భంగా డివిజన్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏపీఎస్ఈబి రూల్స్‌ను పాటించి తమకు పదోన్నతులు కల్పించాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. తాము సంస్థలో నిరంతర సేవలను సమయం పాలన లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నామని యాజమాన్యం తమపట్ల సానుకూల దృక్పథంతో విద్యార్హతను బట్టి పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సుమారు మూడు దశాబ్దాల కాలం విద్యుత్ సంస్థలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా మని తమకు ప్రభుత్వం, యాజమాన్యం ఆలోచించి పదోన్నతులు కల్పించి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరి వేతనాలు పెంచాలని కోరారు. యాజమాన్యం తమ పట్ల సానుకూల దృక్పథంతో తమ సమస్యలు



కాటేదాన్ విద్యుత్తు సెక్షన్ కార్యాలయంలో తమ సమస్యలపై సమావేశమైన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు

పరిష్కరించాలని లేని పక్షంలో కంపెనీలో పనిచేస్తున్న ఆర్టిజన్లు యూనియన్లకు అతీతంగా తమ సమస్యల పోరాటానికై సిద్ధమవుతామని హెచ్చరించారు.



# గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి

- 32 ఎకరాల్లో భవనాల నిర్మాణానికి నిర్ణయం
- రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్లు
- 22 జిల్లాల్లో జిల్లా సమాఖ్య భవనాలకు ఎకరం చొప్పున స్థలం
- వచ్చే ఏడాదిలోపు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీ భవనాలు
- స్పీడ్ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్ 27(నమస్తే ఉదయం): గోషామహల్ లో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని చెప్పారు. గోషా మహల్ లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్సు దాదాపు 32 ఎకరాల స్థలముంది. ప్రస్తుతం పోలీస్ విభాగం అధ్వర్యంలో ఉన్న ఈ స్థలాన్ని వెంటనే వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడే ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సచివాలయంలో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు.

వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజ నర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త మిగతా.. 2లో



ప్రశాంత్ కాలనీలో ఒంగిపోయిన విద్యుత్ స్థంభం

## ప్రమాదం జరిగితే తప్ప... స్పందించరా..?

**రాజేంద్రనగర్, ఆగస్టు27(నమస్తే ఉదయం):**

శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలను పొంచి ఉన్న విద్యుత్‌శాఖ, జీహెచ్ఎంసీఅధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజుల క్రితం ఈ స్తంభాలకు ఆనుకొని ఉన్న ఎండిన చెట్టును డీసీఎం ఢీ కొనడంతో ఆ చెట్టు పూర్తిగా స్తంభంకు ఉన్న తీగలపై పడటంతో మరింత ప్రమాదాన్ని పొంచి ఉందన్నారు. . ఈ మార్గంలో నిత్యం వాహనాలు, పాఠశాలలకు రాకపోకలు సాగిస్తుండటం తో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన అధికారులు పట్టించుకోవడంలేదని విచారం వ్యక్తం చేశారు. అధికారుల తీరు చూస్తుంటే ప్రమాదం జరిగితే తప్ప... పట్టించుకోము అన్నట్లుగా అనిపిస్తుంది. అసలే వర్షాకాలం కావడంతో ఏ క్షణం ప్రమాదం సంభవిస్తానని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## చివరికి న్యాయమే గెలిచింది

**- పోరెడ్డి ధర్మారెడ్డి**

### ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంపై రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ నేతల సంబురాలు


**రాజేంద్ర నగర్, ఆగస్టు27(నమస్తే ఉదయం):**

ఎమ్మెల్సీ కవిత కు బెయిల్ మంజూరు కావడంతో రాజేంద్రనగర్ సర్కిల్ లో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషంలో మునిగిపోయారు. రాజేంద్రనగర్ సర్కిల్



బాణ సంచా కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉప్పరపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఏ ఆధారాలు చూపకుండా అక్రమంగా దౌర్జన్యంగా 166 రోజులు జైల్లో పెట్టారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి అభిప్రాయపడ్డారు., కవితకు బెయిల్ ఇవ్వడం పట్ల సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు..కొంత ఆలస్యమైనా న్యాయమే గెలిచిందని అభిప్రాయ పడుతున్నాం అన్నారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసుగా మేము భావిస్తున్నాం అని అన్నారు. కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తుననన్నారని గుర్తు చేశారు. ఆరోపణలు చేసినవారందరికీ ఈ తీర్పు చెంపపెట్టు అని భావిస్తున్నాం అన్నారు.



## ఘనంగా తన్వి రాజు పుట్టినరోజు వేడుకలు

**శంషాబాద్, ఆగస్టు 27 (నమస్తే ఉదయం):**

జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ శంషాబాద్ మండల్ జడ్పిటిసి మాజీ సభ్యురాలు నీరటి తన్వి రాజు ముదిరాజ్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనసు పూర్తిగా కోరుకుంటూ ప్రజలకు సేవ చేసిన మంచి మనసు ఉన్న మీరు మరి ఎన్నో పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు తెలిపారు. మల్కారం పిఏసిఎస్ డైరెక్టర్ హిరే కార్ శివాజీ. నర్కూడ కాంగ్రెస్ నాయకుడు నీరటి శేఖర్ ముదిరాజ్. నేలటి కృష్ణ ముదిరాజ్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.





# విద్యార్థులకు బ్యాగులు నోటు పుస్తకాల పంపిణీ

**శంషాబాద్, ఏప్రిల్ 27( నమస్తే ఉదయం):**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నగరంలోని సత్య సుందర హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. మంగళవారం ఘాన్సిమియగూడ. గండిగూడ. పాల మాకుల్ పెద్దషాపూర్ గ్రామాలలో గల ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు "సత్య సుందర హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ఫౌండర్ గోపాల్ సింగ్ కుమారుడు సాహిల్ సింగ్. శంషాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మరి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వివిధ గవర్నమెంట్ స్కూల్ లలో స్కూల్ బ్యాగులు. నోటు పుస్తకాలు, స్టేషనరీ పెన్లు, పెన్సిల్లు, రబ్బర్లు పంపిణీ చేశారు.

దాదాపు వెయ్యి మంది పేద విద్యార్థులకు బ్యాగులు పుస్తకాలు స్టేషనరీ సమాన్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఫౌండర్ సాహిల్ సింగ్ కు ధన్యవాదాలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కోటేష్ గౌడ్. షాపూర్ మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్ ఘన్సిమియగూడ మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ళ కృష్ణ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచిలు మల్లేష్, ఇమ్రాన్, వార్డు మాజీ సభ్యులు కిట్టు, రవి, శ్రీను, స్థానిక నాయకులు లీడర్ జంగయ్య, బాబు, శ్రీను,నందు, రాజు, హాస్సన్, ఇలియాజ్, బన్నీ, సాయి, శ్రీనాద్, శ్రీకాంత్, అశోక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి

(మొదటి పేజీ తరువాయి)

పారామెడికల్ కాలేజీలు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలను ముఖ్యమంత్రి చర్చించారు.

రాబోయే 50 ఏళ్ల అవసరాలను అంచనా వేసుకొని, కొత్త ఆసుపత్రి నిర్మాణ డిజైన్లు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడికి చేరుకునే కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని, ఆసుపత్రి చుట్టూరా నలు దిశలా రోడ్డు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళు కూడా నిర్మించాలని ఆదేశించారు.

కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, సేవలన్నీ అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. కేవలం కాంక్రీట్ భవంతులు, బహుళ అంతస్తులు కాకుండా ఆహ్లాదకరమైన విశాలమైన ఖాళీ ప్రాంగణం ఎక్కువగా ఉండేలా డిజైన్లు ఉండాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి అనుభవజులైన ఆర్కిటెక్ట్స్ లతో డిజైన్ లను తయారు చేయించాలని అన్నారు.

ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షించే బాధ్యతను చేపడుతామని ముఖ్యమంత్రి చెప్పారు. మూసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్కడున్న భవనాలను పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు.

గోషామహల్ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించినందుకు పోలీసు విభాగానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పేట్ల బుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ, చుట్టూ ఉన్న స్థలాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ను



ఆదేశించారు. ఇప్పుడు గోషా మహల్ లో ఉన్న పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అక్కడికి తరలించేలా చూడాలని చెప్పారు.

రాష్ట్రంలో కొత్తగా నిర్మించే ఆసుపత్రుల పనులను వేగవంతం చేయాలని, 15 నర్సింగ్ కాలేజీ భవనాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అందుకు వీలుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచే నర్సింగ్ కాలేజీలను ప్రారంభించాలని, తాత్కాలికంగా అద్దె భవనాల్లో వీటిని నిర్వహించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇప్పటికే పది జిల్లాల్లో సమాఖ్య భవనాలున్నాయని, మిగతా 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఒక్కో జిల్లాలో సమాఖ్య భవనాలకు ఒక ఎకరం స్థలం కేటాయిం చేందుకు అంగీకరించారు. ముందుగా స్థలాలను గుర్తించాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ లోని శిల్పారామం పక్కనే మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలని సీఎం ఆదేశించారు. మహిళా శక్తి సంఘాలు తయారు చేసే తమ ఉత్పత్తులతో అక్కడ ఏడాది పొడవునా వివిధ స్టాళ్లు నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రపంచ స్థాయి అతిథులు, వివిధ రంగాల ప్రముఖులు, జాతీయ స్థాయి నేతలు ఎవరు హైదరాబాద్ కు వచ్చినా తప్పకుండా సందర్శించే స్థలంగా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఏడాది పొడవునా నిర్వహించే ఎగ్జిబిషన్‌లా వివిధ రకాల ఉత్పత్తులు అక్కడ అందరికీ అందుబాటులో ఉంచాలని అన్నారు.

## సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హెచ్ఐసీసీలో "గ్లోబల్ ఏఐ సమ్మిట్"

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో తొలిసారిగా జరిగే ప్రపంచస్థాయి ఏఐ సదస్సులో జరిగే ప్రధాన కార్యక్రమాలు, విశ్వవిఖ్యాత వక్తల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ "తెలంగాణ గ్లోబల్ ఏఐ సమిట్ 2024 గురించి పరిచయం చేయడానికి నేనెంతో ఉద్వేగంతో ఉన్నాను. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ ఏఐ రాజధానిగా నిలబెట్టే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నాం. సమ్మిళిత పరిష్కారాలను సృష్టించడానికి ఏఐ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. గణనీయమైన సానుకూల సామాజిక ప్రభావాన్ని నడిపించడానికి పరిశ్రమ నాయకులు, విధానకర్తలు, ఆవిష్కర్తల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఈ లక్ష్యాలను సాధించేందుకు తెలంగాణ సర్వసన్నద్ధంగా ఉంది. అయితే గొప్ప శక్తితో పాటే ఎప్పుడూ గొప్ప బాధ్యత కూడా వస్తుంది. ఏఐని మనం ఉపయోగించుకుంటున్నప్పుడు, అది నిష్పాక్షికత,పారదర్శకత, జవాబుదారీతనంతో మానవాళికి సేవలందించేలా చూడాలి. సదస్సు విజయానికి అపారమైన అనుభవం ఉన్న, వెలకట్టలేని కీలక పారిశ్రామిక సంస్థ అయిన హైసియాతో మా ప్రభుత్వం సన్నిహితంగా పనిచేస్తోందని చెప్పారు.

త్వరలో ఏర్పాటుచేయబోయే నైపుణ్య విశ్వవిద్యాలయం, ప్రతిష్ఠాత్మక ఏఐ సిటీ లాంటి రాష్ట్ర కార్యక్రమాలకు ఐటీ పరిశ్రమ కూడాసహకరించాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఈ సందర్భంగా హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెళ్ల మీడియాతో మాట్లాడుతూ "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భవిష్యత్తు చూపించే ప్రభావం, శక్తి, సామర్థ్యాల విషయంలో మేము ముందంజలో ఉన్నందున పరిశ్రమ ఈ ప్రభుత్వ చొరవను చాలా సమయానుకూలంగా భావిస్తోంది.

2024 ఫిబ్రవరిలో జరిగిన హైసియా వార్షిక జాతీయ శిఖరాగ్ర సమావేశంలో పరిశ్రమకు ఏఐ ప్రాధాన్యం స్పష్టంగా కనిపించింది. ఇక్కడ "కృత్రిమ మేధ భారతదేశం, ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమ, ఆర్థిక వ్యవస్థ, వ్యాపారాల భవిష్యత్తును ఎలా రూపొందిస్తుంది" అనే దానిపై చర్చలు కేంద్రీకృతమయ్యాయి.

కృత్రిమ మేధ నైపుణ్యాలతో పరిశ్రమకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని సృష్టించడంపై దృష్టి సారించి, శిఖరాగ్ర సమావేశానికి మద్దతు ఇవ్వడానికి హైసియా ఎంతో నిబద్ధతతో ఉంది.

టాస్క్, టీ-హబ్, టీఎస్ఐసీ, ఇతర కీలక ప్రభుత్వ సంస్థల సహకారంతో ఏఐ/జీఎన్ఏఐలో 10,000 మందికి పైగా విద్యార్థులను నైపుణ్యాలను పెంచాలని యోచిస్తున్నాం" అని వివరించారు. సదస్సును విజయవంతం చేయడానికి హైసియా ఏ రకంగా కృషిచేస్తోందో కూడా ఆయన తెలిపారు.

## సెప్టెంబర్ 17 నుంచి ప్రజా పాలన

(మొదటిపేజీ తరువాయి..)

అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి... ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.. గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్ ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు.

### ఆరోగ్యంతో చెలగాటమాడితే సస్పెండ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు.

డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

## మాకూ టైం వస్తది

### వడ్డీతో సహా చెల్లిస్తాం!: కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఆర్య, సోదరుడు కేటీఆర్‌తోపాటు హరీశ్‌రావు తదితరులు జైలు వద్దకు చేరుకున్నారు. వైద్య పరీక్షలతోపాటు జైలు నిబంధనలన్నీ పూర్తయిన తర్వాత రాత్రి 9.10 గంటలకు జైలు నుంచి కవిత బయటికొచ్చారు.

సోదరుడు కేటీఆర్‌ను ఆమె ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. కేటీఆర్ తన చెల్లి నుదుటిపై ముద్దు పెట్టారు. అనంతరం ఆమె తన భర్త అనిల్, కుమారుడు ఆర్యను కౌగిలించుకున్నారు. ఆ తర్వాత పార్టీ నేతలందరికీ అభివాదం చేశారు. జై తెలంగాణ, జైజై తెలంగాణ.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యుల గురించి ప్రస్తావిస్తున్న క్రమంలో ఆమె కన్నీరు పెట్టుకున్నారు.

"అందరికీ నమస్కారం. ఐదున్నర నెలల తర్వాత అందరినీ కలవడం సంతోషం. 18 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా. ఎన్నో ఎత్తు పల్లాలు చూశా. కానీ, వ్యక్తిగతంగా నా కుటుంబాన్ని, పిల్లలను వదిలి ఐదున్నర నెలలు ఉండడం ఇదే తొలిసారి. ఇలాంటి ఇబ్బందులు పెట్టిన వారందరికీ తప్పకుండా వడ్డీతో కలిపి చెల్లిస్తాం. మాకూ టైం వస్తది. కష్టకాలంలో మా కుటుంబానికి అండగా ఉన్న అందరికీ పాదాభివందనాలు. నేను తెలంగాణ బిడ్డను. కేసీఆర్ బిడ్డను.

తప్పుచేసే ప్రసక్తే లేదు. నేను మొండిదాన్ని. చట్టబద్ధంగా నా



పోరాటం కొనసాగిస్తా." అని కవిత చెప్పారు. కవిత జైలు నుంచి నేరుగా వసంత్ విహార్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మహిళా కార్యకర్తలు ఆమెకు దిష్టి తీసి స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కవిత కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి బీఆర్ఎస్ కార్యాలయంలోనే బస చేయనున్నట్లు ముఖ్య నేత ఒకరు తెలిపారు. బుధవారం రౌస్ అవెన్యూ కోర్టులో కవితతోపాటు మరో నలుగురిపై సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌పై విచారణ జరగనుంది. దానికి ఆమె వర్చువల్‌గా హాజరవుతారు. మధ్యాహ్నం కవిత, కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు హైదరాబాద్‌కు బయల్దేరతారు.

### అనిల్, వద్దిరాజు పూచీకత్తు..

కవితకు సుప్రీంకోర్టు సీబీఐ కేసులో రూ.10 లక్షలు, ఈడీ కేసులో రూ.10 లక్షల చొప్పున పూచీకత్తుతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ మొత్తాలను కవిత భర్త అనిల్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చెల్లించారు. రౌస్ అవెన్యూ కోర్టులో పూచీకత్తు సొమ్మును జమ చేశారు. అనంతరం కోర్టు 4.20 గంటలకు కవిత రిలీజ్ వారెంట్ జారీచేసింది. ఆ కాపీని అనిల్, వద్దిరాజులు తిహాడ్ జైలు సిబ్బందికి అందజేశారు.

# నూతన విద్యు త్ రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**మెహదీపట్నం, ఆగస్టు27(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ నూతన సూపర్డెంట్ ఇంజనీర్ శ్రీరామ్ మోహన్ కు సర్కిల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం



రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్‌కు చేస్తున్న ఎస్.ఏ.ఓ వీరస్వామి

మెహిదీపట్నంలోని నానల్ నగర్‌లో గల విద్యుత్ ఎస్ ఈ కార్యాలయంలో ఎస్ఏఓలు వీరస్వామి, రవికుమార్, అకౌంట్స్ ఆఫీసర్లు హరీష్ చంద్రశేఖర్, మురళీ గౌడ్, రవీందర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగరాజులు ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ కు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ మాట్లాడుతూ... ప్రభుత్వం, యాజమాన్యం ఆదేశాల మేరకు ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న విద్యుత్తు పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం నిరంతర, నాణ్యమైన విద్యుత్తును అందించాలని సంకల్పంతో ముందుకు వెళుతుందని అందుకోసం క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది బాధ్యతగా పనిచేసే ప్రజలకు సేవలు అందించడంతోపాటు సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

# వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ధరూర్, ఆగస్టు 27(నమస్తే ఉదయం):** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని మంగళవారం ధరూర్ మండలం జాంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు శ్రీకష్ణుడు, గోపికల వేషధారణలతో సభికులను అబ్బురపరిచారు. నత్యాలు,



సాంస్కతిక ప్రదర్శనలతో తమ సజనాత్మకతలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పరుమాల రేవతి కృష్ణుడి జన్మదిన ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం,తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు అన్ని వైద్య సేవలు అందించాలి

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సిద్దప్ప**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(నమస్తే ఉదయం):** ప్రజలకు అన్ని వైద్య సేవలు అందించాలని జోగులాంబ గద్వాల జిల్లా జిల్లావైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప సూచించారు. మంగళవారం జిల్లా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో జిల్లాలో




పనిచేస్తున్న ఎం ఎల్ హెచ్ పి సిబ్బంది కీ జిల్లా స్థాయి ఓరియంటేషన్, కాంప్రహెన్సీవ్ ప్రైమరీ హెల్త్ కేర్, హెచ్ఐవి ఎయిడ్స్, దిశా ప్రోగ్రాం పై సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప మాట్లాడుతూ... ప్రతి వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని, హెచ్ఐవి ఎయిడ్స్, అన్ని విషయాలు తెలుసు కుని, ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సంధ్యా కిరణమైయి, డిపిఎం మాధవి, డిడియం రామాంజనేయులు,కళ్యాణి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, బిఏఎంఎస్ డాక్టర్లు, ఎయిడ్స్ దిశా ప్రోగ్రాం సిబ్బంది రాఘవేంద్ర రెడ్డి , రమేష్ , డిఎండిఓ సాయికుమార్ పాల్గొన్నారు.

## బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ కోర్సులో

# మాస్టర్ శ్రీహరికి అవార్డు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(నమస్తే ఉదయం):** గద్వాలకు చెందిన శ్రీహరికి అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ కోర్సులో అవార్డు లభించింది. ఈనెల 21వ తేదీ నుండి 26వ తేదీలలో జారండ్‌లోని రాంచినందు అంతర్జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ కోర్స్‌లో పాల్గొని పట్టా తీసుకున్న మాస్టర్ కే శ్రీహరిని ఉమ్మడి జిల్లా



టెక్నికల్ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట స్వామి, రాజేశ్వర, సుధీర్ కుమార్ ,శాంతి ,హరి, సాయి సన్మానించారు.





కళ్యాణ మహోత్సవంలో పాల్గొన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులు, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత, మాంగల్య ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్న పూజారులు

## అంగరంగా వైభవంగా శ్రీజమ్ములమ్మ

# అమ్మవారి కళ్యాణ మహోత్సవం

**కళ్యాణోత్సవ కార్యక్రమానికి హాజరైనా ప్రముఖులు - వందలాదిగా తరలివచ్చిన భక్తులు**

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు27(నమస్తే ఉదయం):** నడిగడ్డ ఇలవేల్పుగా విరాజిల్లుతూ అఖండ భక్త జనంతో పూజలందుకుంటున్న జములమ్మ అమ్మవారి కల్యాణ వార్షిక మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. శ్రీజమదగ్ని, జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణోత్సవ మహోత్సవ కార్యక్రమం మంగళవారం గద్వాల పట్టణ పరిధిలోని శ్రీ జమ్ములమ్మ , పరశురామ స్వామి దేవస్థానం నందు జమదగ్ని, జమ్ములమ్మ అమ్మవారు ఒక్కటయ్యారు. శ్రావణ, బహుళ, నవమి, మంగళవారం మద్యాహ్నం 12గంటల 15 నిమిషాల సుమూహూర్తమున స్వామివారు, అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. అంతకుముందు సంప్రదాయం ప్రకారం.. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం పెట్టారు. కల్యాణ తంతును వందలాది మంది భక్తులు చూసి ధన్యులయ్యారు. కాగ ఉదయం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బండ్ల జ్యోతి దంపతులు పట్టువస్త్రాలు, పసుపుకుంకుమలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ గాయత్రి సతీష్ కుమార్, ఈఓ పురేందర్ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనందున ఆలయ నిర్వహకులు, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ....జమ్ములమ్మ అమ్మవారు వెలిసిననాటి నుంచి మాఘమాసంలో అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పాలక మండలి కమిటి చైర్మన్ గాయత్రీ సతీష్ కుమార్ , సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణోత్సవ వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం నాలుగో మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులతో



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

ఉండాలని, విస్తారంగా వర్షాలు కురవాలని, పాడిపంటల సమృద్ధిగా కలగాలని కోరారు.

### కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

జమదగ్ని, జమ్ములమ్మ కళ్యాణోత్సవ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ సరితాతిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సత్య రెడ్డి, జి. వేణుగోపాల్, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, జెడ్పీటిసిలు, మాజీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అనంతరం జమ్ములమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం, నడిగడ్డ ప్రాంతంలో రైతులకు సకాలంలో వర్షాలు పండాలి. రైతుల పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, రైతు అభివృద్ధి చెందాలన్నారు. వ్యాపార, విద్యా వైద్య రంగాలలో సీఎం రేవంత్ రెడ్డి పాలనలో




అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని అదేవిధంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు.

## అనధికారికంగా వసతి గృహాలు నిర్వహిస్తున్న

# ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(నమస్తే ఉదయం):** జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా వసతి గృహాలు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిఈఓ కార్యాలయంలో సూపర్డెంట్ విజయ లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ శివకుమార్ మాట్లాడుతూ...జిల్లాలో అలంపూర్ లో మాంటిశ్వరి, ఎర్రవల్లి లోని ఏకశిలా ఇంటర్నేషనల్, ఐజలోని బ్రైట్ స్టార్, జిల్లా కేంద్రంలోని విశిష్ట నోబెల్, ఇండో ఇంగ్లీష్, అబ్రహం తదితర విద్యాసంస్థలు అనధికారికంగా ప్రైవేటుగా వసతి గృహాలను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తాము ఎవరికి వసతి గృహాలకు అనుమతులు ఇవ్వలేదని అంటున్నారని అటువంటప్పుడు పాఠశాల ప్రాంగణాలలోనే వసతి గృహాలను నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటు వసతి గృహాలలో చదివే విద్యార్థులు ఎక్కువగా 14 సంవత్సరాల వయస్సు లోపు విద్యార్థులు ఉంటున్నారని వీరికి



పోషకాలలో కూడుకున్న ఆహారం అందించకపోతే అది విద్యార్థులపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందన్నారు విద్యార్థి సంఘాలను వసతి గృహాలలోకి అనుమతించనప్పుడు విద్యా శాఖ అధికారులు అక్కడ తనిఖీలు చేయనప్పుడు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ఏ విధంగా తెలుస్తుందని నిలదీశారు. వసతి గృహాల నిర్వహణ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు వసూలు చేయడమే కాక విద్యార్థుల నుండి ఆదనంగా వసూలు చేస్తున్న ఫీజులకు లెక్కే లేకుండా పోయిందన్నారు.

ప్రభుత్వంతో విద్యాశాఖ వారి అనుమతితో ప్రైవేటు విద్యాసంస్థలు వసతి గృహాలను నిర్వహిస్తే అభ్యంతరం లేదని కానీ ఎవరి అనుమతి లేకుండానే వసతి గృహాలను నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల ఎంఈవోలు స్థానికంగా వారి వారి మండలల పరిధిలో స్థానికంగా విద్యాసంస్థలు నిర్వహిస్తున్న ప్రైవేటు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాల గురించి తనిఖీలు చేయాలని వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలను పరిశీలించాలని ప్రభుత్వం విద్యాశాఖ అనుమతి లేని వసతి గృహాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ కుమార్ మహేష్ వసంత్ రాజేష్ రాము శివ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తాం

**- డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్**

**రాజేంద్రనగర్, ఆగస్టు27(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్‌లో జరిగే వినాయక నిమజ్జనం ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్, మండపాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ మాట్లాడుతూ, విద్యుత్, వాటర్ వర్క్స్, గ్రేటర్ ఎలక్ట్రికల్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం, పోలీస్ శాఖల కు చెందిన అధికారుల సమన్వయంతో గత సంవత్సరం కంటే మరింత ఉన్నతంగా నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ సమీపంలోని పత్తి కుంట లో మూడు క్రేన్లు, మైలార్ దేవ్ పల్లి పల్లె చెరువులో రెండు క్రేన్ లు, మీరాలం చెరువులో ఒక క్రేన్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ కుమార్, ఏసీపీ తులశ్రీనివాస్, రాజేంద్రనగర్, మైలార్ దేవ్‌పల్లి, ఇన్స్‌పెక్టర్లు క్యాస్ట్రో, పి నరేందర్, వివిధ శాఖల అధికారులు నరేందర్ గౌడ్, శ్రీనివాస్, రామారావు, సత్యనారాయణ, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్,





వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్లపై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఎన్. మల్లారెడ్డి , సామ ఇంద్రపాల్ రెడ్డి , ఎం కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

### వీధి దీపాలను ఏర్పాటు చేయండి:

ప్రధాన రహదారుల్లో , బస్తీలలో చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి వరకు వీధి దీపాలు అన్ని వెలిగేటట్లు చూడాలన్నారు. పత్తి కుంట , పల్లె చెరువులో గురపు డెక్కను తొలగించాలన్నారు. పాడైన రోడ్లను బాగు చేయాలని అన్నారు.



నూతన ఎస్ ఈ చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ సబ్ ఇంజనీర్లు

## విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ నూతన ఎస్ఈ చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సర్కిల్ సబ్ ఇంజనీర్లు

**మెహదీపట్నం, ఆగస్టు27(నమస్తే ఉదయం):** సైబర్ సిటీ సర్కిల్ విద్యుత్ ఎస్ ఈ గా చంద్రశేఖర్ పదవి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం నూతన ఎస్ ఈ చంద్రశేఖర్‌కు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సబ్ ఇంజనీర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జగిత్యాల జిల్లా బిజెపి ఇన్ ఛార్జ్‌గా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ




**రాజేంద్రనగర్, ఆగస్ట్ 27(నమస్తే ఉదయం):** జగిత్యాల జిల్లా బిజెపి ఇన్ ఛార్జ్‌గా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ ముదిరాజ్ నియమితు లయ్యారు. ఈ మేరకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా డి సత్యనారాయణ మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలిపి లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతను అప్పజెప్పిన ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శులు ఈశ్వరప్ప, నందనం దివాకర్, మోర్చా రాష్ట్ర పార్టీకి జిల్లా నాయకులకు అందరికీ సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

## రామకృష్ణ పురం గ్రామంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుక

**కొత్తకోట, ఆగస్టు27(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను గ్రామ యాదవ సోదరులు,



గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు కలిసి ఘనంగా ఉట్ల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ చక్రి వర్ధన్ రెడ్డి, యాదవ సోదరులు,కార్యక్రమం లో పాల్గొని స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి

### - కార్పొరేటర్ ఎం సంగీత

**రాజేంద్రనగర్, ఆగస్ట్ 27(నమస్తే ఉదయం):** అభివృద్ధి పనులు నాణ్యతగా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ అధికారులకు సూచించారు.

మంగళవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో ఐదు లక్షల రూపాయలతో



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్

చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కార్పోరేటర్ సంగీత పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ... ప్రజాధనం వృధా కాకుండా అధికారులు పనుల నిర్వహణపై పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించాలన్నారు.

డివిజన్లో అభివృద్ధి పనులు దశలవారుగా చేపట్టి అత్తాపూర్ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. బస్తీ ప్రజల కు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దశలవారీగా క్షేత్ర స్థాయిలో అధికారులతో చర్చించి పరిశిలించి, పూర్తి చేయిస్తామని బస్తి వాసులకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వనం శ్రీరామ్ రెడ్డి, బిజెపి నాయకులు బీట్కూరి సిద్దేశ్వర్, ఎల్ వెంకటేష్, హనుమంతరావు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.





## కుక్కలు బాబోయ్... కుక్కలు

### ఇండ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్న జనం

### ఏ వీధి చూసిన దర్శనమిస్తున్న గ్రామ సింహాలే

### గ్రామసింహాల నుంచి రక్షించండి మహా ప్రభో అని వేడుకుంటున్న ప్రజానీకం

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(నమస్తే ఉదయం):** గద్వాల మున్సిపాలిటి పరిధిలో ఎక్కడ చూసినా కుక్కలు సైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ వార్డులో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు కనబడుతుండటంతో స్కూల్ కి వెళ్లే పిల్లలను కుక్కలు ఏమి చేస్తాయో అని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కుక్కల బెడదను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గద్వాల మున్సిపాలిటి పరిధిలోని 24వ వార్డు అహ్మద నగర్ కాలనీలో కుక్కల భయానికి ఇళ్ల నుంచి బయటికి రావాలంటే కాలనీవాసులు భయపడుతున్నారు. ఇంటి ముందర పిల్లలు ఆడుకోలేకపోతున్నారు. ఇంటి ముందర కుక్కల గుంపు చూసి ఇంటి యజమానులు గేట్లకు లాక్ వేసి లోపలే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదనుంచి రక్షించాలని కోరుతున్నారు.

## గొర్రె కాపర్లను ఇబ్బంది పెట్టకండి

### కురుమ సంఘం ప్రతినిధి ఎస్ వెంకటేష్

### శ్రీశైలం అడవుల్లో గొర్రెల మేపుకోవడానికి అవకాశం ఇవ్వాలి

**హైదరాబాద్, ఆగస్టు27(నమస్తే ఉదయం):** పాలమూరు జిల్లా గొర్రె కాపరులను శ్రీశైలం అడవుల్లో గొర్రెలను మేపేందుకు ఫారెస్ట్ సిబ్బంది రానివ్వకుండా వేధిస్తున్నారని కురుమ సంఘం నాయకులు వాపోయారు. ఖరీఫ్ సీజన్లో సాగు విస్తీర్ణం పెరగడంతో గొర్రెల మేత కోసం అడవులకు వెళ్లడం జరుగుతుందని గుర్తు చేశారు. హైదరాబాద్ – పాలమూరు కురువ సంఘం కార్యవర్గ నాయకులు మంగళ వారం ఉదయం నగరంలోని అరణ్య భవన్‌లో అటవీశాఖ ఉన్నత అధికారి డోబిరియల్ కలిసి సమస్యలని వివరించారు. గొర్రె ల కాపరులకు అనుకూలంగా మాట్లాడడం జరిగింది... సానుకూలంగా స్పందించిన ఉన్నతాధికారులు. వారు మూడు కండిషన్ లు పెట్టారు. గొర్రెల మాత్రమే మేపాలని, మేకలు ఉండకూడదని సూచించారు.

చెట్లను నరకకూడదని, మొక్కలు ఉన్నచోట జాగ్రత్త వహించాలన్నారు. వంట వార్పు చేసుకున్న తర్వాత మంటలు ఆర్పేయాలన్నారు. ఖచ్చితంగా ఈ నిబంధన పాటించాలని సూచించారు. గొర్రె కాపరులు అధికారులు చెప్పిన నిబంధనలు పాటించి సహకరించవలసిందిగా నాయకులు



ఫారెస్ట్ విభాగం ఉన్నతాధికారికి వినతి పత్రం అందచేస్తున్న కురుమ సంఘం నాయకులు ఎస్. వెంకటేష్, తదితరులు

కోరారు.

అధికారులును కలిసిన వారిలో శంకరోళ్ళ రవి కుమార్ కురువ, జిల్లా అధ్యక్షులు మాదారం కృష్ణ కురువ, జంటనగరాల అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురవ , సలహాదారు కన్మనూరు రామ్ కురువ, సెక్రటరీ బాన్యనోల రామచంద్ర కురువ .. వైస్ ప్రెసిడెంట్ జైత్రం శ్రీనివాస్ కురువ, అప్ప శ్రీను కురువ , నామాల రామ్ కురువ, శివ కురువ, మల్లేష్, ప్రవీణ్, సన్నీ కురువ, జేక్లర్ నర్సింహ్మా కురువ , రిషి కురువ, గబ్బర్ సింగ్, డీకే నర్సింహ్మా కురువ, గుడిగండ్ల కుల పెద్దలు, జేక్లర కుల పెద్దలు పాల్గొన్నారు.

## దోమలపై రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది సమరం

**రాజేంద్రనగర్, ఆగస్టు27(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు.

ఇటీవల నగరంలో వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి విష జ్వలాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవ్ పల్లి , సులేమాన్ నగర్ , శాస్త్రి పురం డివిజన్ల లోని ప్రతి ఇంటికి వెళ్లి దోమల నిర్మూలలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అదే సమయంలో ప్రతి ఇంటి వద్ద యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్నామని తెలిపారు. సాయంత్రం వేళల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ స్ప్రే చేపడుతున్నామన్నారు.

### ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి :

ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత సామాగ్రిని ఇంటి పరిసరాలలో ఉండకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూల తొట్లలో నీరు ఉండకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



అత్తాపూర్ ఖాజా నగర్‌లో ఇంటి ముందు ఉన్న నీళ్ల డ్రమ్ములో దోమల లార్వా ఉండకుండా యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్న సిబ్బంది



దోమల నిర్మూలనకు సులేమాన్ నగర్‌లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### - ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, ఆగస్టు 27(నమస్తే ఉదయం):** అమ్మవారి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలని మల్కాజి గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

శ్రావణ మాసచివరి మంగళవారం సంధర్భంగా మల్కాజిగిరి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, సతీమణి మర్రి మమతా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సంధర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో భక్తి శ్రద్దలతో అమ్మవారిని పూజిస్తున్న ప్రతి ఒక్కరికీ అమ్మవారి , అశీసులుంటాయని, శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయ నిర్వాహకులు చాలా గొప్పగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని, నిర్వాహకులు కోరిన ప్రకారం తాను కూడా తనవంతు భాద్యతగా అమ్మవారి ఆలయ తలుపుల ఏర్పాటుకు ఒక్క కిలో వెండిని బహుకరిస్తానని అన్నారు.



కళ్యాణోత్సవంలో పాల్గొన్న మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు

ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అరుంధతీ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్లు నిరుగొండ జగదీష్ గౌడ్ ,నిరుగొండా మంజుల గౌడ్, తదితరులున్నారు.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733